



గుడిసేవ వెంకటేశ్వరరావు

శ్లో॥ గతమిహ భవతా పథాచయేన
స్థితమపి యత్రచ యత్రవా నిషణ్ణమ్।
శయితమపి మునీంద్ర యత్రయోగాత్
తదపిశతమ్ప్రణమామి పుణ్యతీర్థమ్॥

శ్రావ్యంగా వినవస్తోంది ప్రార్థనా శ్లోకం. ఆ అత్యంత ప్రశాంత వాతావరణంలో చల్లగాలి అలలమీద తేలియాడుతూ వస్తోంది. సహజంగా శ్రావ్యమైన ఆ గాత్రాలకు భక్తి పారవశ్యకత పరిపూర్ణతను ప్రసాదించింది.

నిండు పూర్ణిమ. మబ్బులు తేలియాడని నిర్మలాకాశం లోయలతోనూ, గుట్టలతోనూ చుట్టబడియున్న ప్రదేశం. నందనోద్యానం లాగున్న చెట్లగుబురులతో స్వాప్నిక జగత్తులాగున్న భూలోకం. అంతవరకు పర్వత సానువుల్లో అలసి సొలసి ప్రవహించి ఒకరి కౌగిలిలో ఒకరు కరిగిపోతూ ఆనందంతో నవ్వుకొంటున్నాయి మందాకినీ అలకనందలు. అమృత ఝరుల పావనోదకాలతో పావనమైన పుణ్యక్షేత్రమది.

క్షణంక్రితం ఆశ్రమంలోనుంచి వినవచ్చిన ప్రార్థనాశ్లోకం నా మనోపథంలో మెదిలింది. భక్తులంతా భగవానునితోపాటు మరోమహావ్యక్తికి వందనశతాలర్పిస్తున్నారు. "ఓ మునీంద్రా! నీవుత్రొక్కిన బాట, నీవు నిలచినచోటు, నీవు శయనించిన స్థలమే, యోగావస్థలో నీవున్న ప్రదేశమే మహాపుణ్య తీర్థములు. వాటికి మావందన శతములు" అని మోకరిల్లుతున్నారు.

తమ అమృతహస్తంలో, తమ అమృత వాక్కులో, తమ అమృత జీవనంతో ఆ ప్రదేశాన్ని అమృతమయం చేసిన, మృత్యుంజయులైన మౌనిపుంగవులు మందహాసంచేస్తూ భక్తులను అదృశ్య రూపంలో ఆశీర్వదిస్తున్నారు.

ఆ వెన్నెల్లో వెండికొండలా మెరుస్తున్న ఉత్తుంగ హిమాలయాలు మానవలోకానికి దివ్యసందేశాలను మోసుకొస్తున్నాయి మందాకినీ అలకనందల గలగలలు బృందావన మంజీరాల్లా మరులు గొలుపుతున్నాయి.

ఏదోపక్షి కమనీయంగా పాడుతోంది. ఆకాశంనుంచి అప్పుడప్పుడూ మంచు బిందువులు రాలుతున్నాయి. యోగావస్థలోనున్న మౌనిపుంగవుని మనస్సులా ప్రశాంతంగావుంది వాతావరణం. వెన్నెల కమ్మదనం మల్లెపూల స్పర్శలాగుంది. హృదయం పారవశ్యంతో జోగుతోంది.

ఏవేవో వింతవింత ఆలోచనలు మనస్సులో ముసురుతున్నాయి. లౌకిక జగత్తునుంచి అలౌకిక జగత్తువైపుకు పరుగెడుతున్నాయి.

బంధుమిత్రులకూ, భార్యాబిడ్డలకూ అందరికీ దూరంగా ఇలా ప్రకృతిమాత ఒడిలో పవ్వళిస్తూ వుండిపోతే ఎంత బాగుంటుంది! నిజంగా బాహ్యానందానికి మితంలేదు. ఎన్నిహంగులున్నా, ఎంత సుఖపడినా ఏదో తీరనివ్యథ తినేస్తూనే వుంటుంది. పరిపూర్ణానందమంటే ఆత్మానందమే. అది లభ్యమయిన రోజున వ్యక్తికింకా తీరని కోరికంటూ ఏమీ మిగలదు. ఆ రహస్యం గమనించబట్టే మహామహులైన మన పూర్వులు సర్వసంగ పరిత్యాగులై కందమూలాలు భక్షిస్తూ, సెలయేటి ఉదకాలతో జీవిస్తూ, అలౌకికానందంకొరకు ఆత్మాన్వేషణ చేసుకుంటూ అలా జీవితాపణంగా ఒడ్డేవారు. నేటికీ ఒడ్డుతున్నారు ఈదుర్గమారణ్యంలో ఆశ్రమాలు వెలవటమే అందుకు తార్కాణం. కాని....

"బాబూ....!"

ఉలికిపడి లేచినిలబడ్డాను. నాలుగడుగుల దూరంలో ఎవరో స్వామీజీ నిలబడివున్నారు. ఆశ్చర్యం ముప్పిరిగొన్న గొంతుతో "నమస్తే స్వామీజీ" అన్నాను చేతులుజోడిస్తూ. స్వామీజీ ఆశీర్వదించి తన వెంట రమ్మని ముందుకు నడిచారు. మంత్రముగ్ధుడిలా అనుసరించాను నేను.

ఏమేమో ఆలోచనలు, ఎన్నెన్నో సందేహాలు, తెలుగుదేశానికి వందలమైళ్ళ దూరంలోనున్న ఈహిమవత్పర్వత ప్రాంగణాల్లో, స్వచ్ఛమైన గొంతుతో, మృదువుగా సంబోధించిన ఒక స్వామీజీని చూచేసరికి, నాలో ఆశ్చర్యమూ ఆనందమూ ఒక్కసారి పెల్లుబికినాయి. నా సందేహాలనూ, ఆశ్చర్యాన్ని నాలోనే దిగమ్రింగుకొని మెల్లగా స్వామీజీ వెంట నడిచాను. ఒక సెలయేటి వడ్డునవున్న నల్లటిబండరాళ్ళదగ్గర ఆగారు స్వామీజీ. నాకొక సమతలంగావున్న బండరాయి చూపించి తాను మరొకదాని మీద ఆసీనులయ్యారు.

క్షణాలు దొర్లిపోతున్నాయి. ఇంతవరకు నేను కాంక్షించిన నిశ్శబ్దమే నాలోని అశాంతికి కారణమౌతోందిప్పుడు. స్వామీజీ ముఖంలోకి చూచాను. వారెటో శూన్యంలోకి చూస్తున్నారు.

ప్రచురణకు స్వీకరించిన
పోటీ కథ

మింటపూర్ణిమచంద్రుడు మందహాసం చేస్తున్నాడు. కలువకన్నెకోసం కలువరిస్తున్నాడు. వికసించిన అడవి పువ్వుల సుగంధాన్ని దశదిశలా వ్యాపింపజేస్తున్నాయి.

"నీ వివాహమయ్యి ఎన్ని సంవత్సరాలయింది బాబూ!" అన్నారు స్వామీజీ. నేనాశ్చర్యపోయాను నా వివాహంతో ప్రస్తుతమీ స్వామీజీకిగల పనేమిటో అర్థం కాలేదు. నావూరూ పేరూ అడుగుతారేమో ననుకున్నాను. ఎంచేతంటే అందరూ అడిగే సర్వసామాన్యమైన ప్రశ్నది. కాని అదేమీలేకుండా నా వివాహాన్ని గురించి ప్రశ్నించటంతో నాగురించి స్వామీజీకి కొద్దో గొప్పో తెలిసుండాలనిపించిందినాకు

"చెప్పు బాబూ!" అన్నారు స్వామీజీ మళ్ళా.

"దాదాపు ఎనిమిదేళ్ళవుతుంది స్వామీజీ...."

"ఇంతవరకు మీకు సంతానం లేదు కదూ....?"

"అవును...."

"డాక్టరుసలహా తీసుకున్నారా....?"

"తీసుకున్నాము స్వామీజీ. కాని ఫలితంలేదన్నారు...."

"అందుకొరకు విచారించికూడా ప్రయోజనముండదుబాబూ" అన్నారు స్వామీజీ నా కళ్ళల్లోకి చూస్తూ.

ఇంతకీ అసలీ స్వామీజీ ఎవరో, ఆయన వుద్దేశ్యమేమిటో, నాకువారు చెప్పదలచుకున్న విషయాలేమిటో నా కెంత మాత్రమూ అర్థంకాకుండా వుంది. వారి ప్రశ్నలు వింటుంటే ఆశ్చర్యమూ, అయోమయమూ పెనవేసుకు వస్తున్నాయేగాని నా అనుమానాలు ఒక్కటీ తీరటంలేదు.

"బాబూ! నీకభ్యంతరంలేకపోతే నిన్ను గురించి కొంత వివరంగా తెలుసుకోవాలని వుంది" అన్నాడు స్వామీజీ.

నేను మరీ ఇరుకున పడ్డాను. ఎవరో అపరిచితవ్యక్తి నన్ను గురించి తెలుసుకోవాలని కుతూహలపడటంలోని రహస్యమేమిటో మాత్రం అర్థం కావటం లేదు. ప్రస్తుతం నన్నుగురించి నోరువిప్పిచెప్పాలో లేక మౌనంగా కూర్చోవాలో నిర్ణయించుకోలేక తికమక పడ్డాను.

"ఒక విషయం మాత్రం ముందుగానే నీకుచెప్పదలచాను బాబూ! ఇప్పుడు నీ ఊహాపథంలో చాలా సందేహాలు మెదులుతున్నాయ్యని నాకుతెలుసు. ఎవరో అపరిచితుడు ఈ విధంగా ప్రశ్నించటమేమిటని నీవు అనుకోనూవచ్చు. అలా ప్రశ్నించటం భావ్యంకాదని నాకు తెలియకనూ పోలేదు. కాని కొన్ని కారణాంతరాలవల్ల నేనిలా చేయవలసి వచ్చింది. నన్ను గురించిన వివరాలుకూడా ప్రస్తుతమేమీ చెప్పలేను. సమయమొచ్చినపుడు నాకుగా నేనే అన్ని విషయాలూ తెలియజేస్తాను కాని ఒక్కటి మాత్రం నీవింతకుముందే గమనించి వుండాలి. నేను తెలుగువాణ్ణి ఈ ప్రాంతానికొచ్చి దశాబ్దాలు గడచిపోయాయి."

"మాది కృష్ణాజిల్లాలోని ఒక గ్రామం స్వామీజీ" అన్నాను. నన్ను గురించి చెప్పుకోబోయేదానికి ఉపోద్ఘాతంగా.

"గ్రామంపేరు....?"

"కమలాపురం"

"చాలా సంతోషం. తరువాత?"

"నాకు ఆరేళ్ళ ప్రాయంలో మాతండ్రిగారెటో వెళ్ళిపోయారు. అప్పటి నుంచీ మా అమ్మగారే పలువిధ కష్టనష్టాలుకోర్చి నన్ను సాకి పెంచి పెద్దజేసారు. బి. ఎ. వరకూ చదివించారు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాను. రెండు సంవత్సరాల క్రితం మా తల్లిగారు అకస్మాత్తుగా కలరావచ్చి చనిపోయారు. ఈ విశాల విశ్వంలో ప్రస్తుతం నేను దాదాపు ఏకాకిని నేను ఏకాకినన్న ఈ భావమే నన్ను వేధిస్తూంటే, వివాహమయి ఎనిమిది సంవత్సరాలయినా సంతానానికి నోచుకోని నాబాధను ఏమని చెప్పుకునేది. నాతో నా వంశం అంత మవబోతోందని ఆలోచన కలిగినప్పుడల్లా నాలో గూడుకట్టుకున్న విషాదం విజృంభిస్తూ వుంటుంది. ఇహ నాభార్య ఆవేదనకు అంతమే కన్పించదు. పోనీ ఆమె తరపున ఎవరైనా బంధువుల పిల్లాడని పెంచుకుందామని ఆమెకు నచ్చచెప్ప యత్నించి విఫలుణ్ణయాను. ఇంకా భవిష్యత్తుమీద ఆమెకాశ వున్నట్టుంది. ఆ ఆశను అంతంచేయటం నాకిష్టంలేదు. అందుకే నాకంతగా ఇష్టంలేకపోయినా ఆమెకోరికను మన్నించి రెండునెలలు శెలవు తీసుకుని తీర్థయాత్రలకు బయలుదేరాము. టూకీగా నాకథ ఇది స్వామీజీ"

"నీపేరు తెలుసుకోవచ్చునా బాబూ."

"అందరూ రాఘవ అంటారు. పూర్తి పేరు రాఘవరావు...."

"చాలు బాబూ! ఇంకనువ్వేమీ చెప్పనవసరంలేదు. అన్ని విషయాలూ నా కవగత మయ్యాయి. రేపుఉదయం నీభార్యతో సహా, అదుగో - ఆ కన్పిస్తున్న నా కుటీరాని కొకసారి వచ్చివెళ్ళండి.." అంటూనే లేచి నిలబడ్డారు స్వామీజీ.

"తప్పకుండా రేపుదయం మీ దర్శనం చేసుకుంటాము." అన్నాను. స్వామీజీ మౌనంగా తల పంకించి ముందుకు కదిలారు.

సెలయేటిలో ముక్కలయిన చంద్రుని ప్రతిబింబం చూస్తూ నేను కొన్ని క్షణాలు అలాగే వుండిపోయాను.

* * *

ఉదయం లేచేసరికి ఆరుగంటలయింది. అప్పటి కప్పుడే అందరూ లేచి ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. ప్రార్థనాగీతాలతో ఆశ్రమాలు మారుమ్రోగుతున్నాయి.

నా భార్య జాహ్నవికూడా ఆ చన్నీటిలోనే తలారా స్నానంచేసి కురులెండబెట్టుకుంటోంది. నన్నుచూచి చిన్నగా నవ్వింది.

మరో అరగంటలో ఇద్దరం రాత్రి స్వామీజీ చూపించిన ఆశ్రమంవైపుకు బయలుదేరాము. అప్పుడే పర్వత శిఖరాగ్రంనుంచి సూర్యభగవానుడు తొంగి చూస్తున్నాడు. మంచు తుంపరులనుంచి

(తరువాయి 21 వ పేజీలో)

## ఎండమావులు

(12 వ పేజీ తరువాయి)

ప్రసరిస్తున్న సూర్యకిరణాలు సప్తరంగులను సృష్టిస్తున్నాయి తరులతాకులతో నిండిన లోయలు సుహాసినిలా క్రొత్త అందాన్ని పులుముకున్నాయి.

ఆశ్రమానికి చేరుకున్నాము. మాకొరకే ఎదురు చూస్తున్నారు కాబోలు - స్వామీజీ ప్రాంగణంలోనే ఎదురు పడ్డారు. మమ్మల్ని సాదరంగా ఆహ్వానించారు. జాహ్నవి స్వామీజీ పాదాలపైన మోకరిల్లింది. ఆయన ఆశీర్వదించి లేవనెత్తారు. వారి ముఖంనుంచి ఏదో వింత కళ తొంగి చూస్తోంది

కుటీరానికి అల్లంతదూరంలో ఒక విశాలమైన చావడిలాంటిదుంది స్వామీజీ శిష్యులు కాబోలు - అక్కడ చాలమంది సన్యాసులున్నారు. అంతమంది మనుషులున్నా గాలికి ఆకల్లాడితే విన్పించేటంత నిశ్శబ్దంగావుంది.

స్వామీజీ ఒక చిన్న గదిలోకి దారి తీశారు. అక్కడ కాయలు, పండ్లు ముక్కలుగా కోసి ఆకుల్లో అమర్చబడి వున్నాయి. రెండు మట్టి పిడతల్లో తేనెవుంది. వాటిని తీసుకోవలసిందిగా కళ్ళతోనే స్వామీజీ మమ్మల్ని ఆదేశించారు. మారు మాట్లాడకుండా తినటం ప్రారంభించాము నాకంతా ఏమిటో క్రొత్తగా వుంది. మా యీ యాత్రలో ఇప్పటికి చాలామంది స్వామీజీలను చూచాము. వారి ఆశ్వీర్వాదాలను అందుకున్నాము. కాని ఈ స్వామీజీ మమ్మల్నేదో ప్రత్యేకాదరాభిమానాలతో చూస్తున్నట్లనిపించింది వారి ముఖంలోని గంభీరత ఏదో మమ్మల్ని పూర్తిగా వశపరచుకొంది.

అల్పాహారం పూర్తిచేసి స్వామీజీతో మరో గదిలోకి నడిచాం. అది పఠన మందిరం లాగుంది ఒక చిన్న చెక్క బీరువాలో ఆంధ్ర, సంస్కృత గ్రంధాలున్నాయి. దానికి దగ్గరలోనే ఒక జింక చర్మంమీద స్వామీజీ ఆశీనులయ్యారు. కాస్త ఇవతలగా తాటాకు చాపమీద మేము కూర్చున్నాము. ఆ గదిలో ఒక ప్రత్యేక వేదికపైన అమర్చిన సరస్వతీదేవి పటము వైపు చూస్తూ కూర్చుంది జాహ్నవి.

"అమ్మా జాహ్నవీ!" అన్నారు స్వామీజీ.

"ఏమిటి స్వామీజీ!" అంది ఆశ్చర్యంగా. జాహ్నవికేకాదు నాకూ ఆశ్చర్యం కలిగింది. ఆమె పేరు జాహ్నవి అని వారికెలా తెలుసోమరి! నా మట్టుకు నేను మాత్రం చెప్పలేదు రాత్రి నేను వారితో సంభాషించినపుడు నా పేరడిగి తెలుసుకున్నారుగాని, నా భార్య పేరడగలేదు....

"చూడు తల్లీ" అన్నారు స్వామీజీ ఉపోద్ఘాతంగా. తిరిగి మళ్ళా వారే అందుకున్నారు

"భగవానులు నీ విషయంలో నాకు కొన్ని ఆదేశాలిచ్చారు తల్లీ....!"

"సెలవివ్వండి స్వామీజీ"

"ఆచరిస్తావా తల్లీ"

"భగవానుల ఆదేశం కదా స్వామీ"

"అవును తల్లీ భగవానుల ఆదేశమే. ఇదొక్కటి మాత్రమే కాదమ్మా! ఈ సృష్టిలో జరిగే ప్రతి పనీ వారి ఆదేశానుసారమే జరుగుతూంటుంది...."

"భగవానుల కృపకు పాత్రులం కాగలగటం మినహాయించి ఏ వ్యక్తిమాత్రం కోరుకోవలసింది ఏముంటుంది స్వామీ. తప్పక సెలవివ్వండి...."

"నీ కొక బహుమతిని అందజేయవలసిందిగా భగవానులు నన్నాదేశించారమ్మా"

"చిత్తం స్వామీ! అనుగ్రహించండి"

స్వామీజీ ఎవర్నో పిలిచారు. ఒక సన్యాసి లోనికొచ్చి మౌనంగా నిలబడ్డాడు.

"బాబును తీసుకురా ఆనంద్...." స్వామీజీ.

మరో రెండు నిమిషాల్లో ఆ సన్యాసి ఒక పండులాంటి పాపాయిని తీసుకొచ్చి స్వామీజీ కందించాడు.

"స్వీకరించు తల్లీ! ఈ బాబుడే భగవానుల బహుమతి" అని పాపాయిని జాహ్నవి కందించారు స్వామీజీ జాహ్నవి ముఖంలో ఒక్కసారి వెయ్యిమెరుపులు మెరిశాయి.

"ఈ బాలుని జన్మవిశేషాలను గురించీ ఇతర వివరాలను గురించీ తెలుసుకోవాలని మీ దంపతులిరువురకూ చాలా కుతూహలంగా వుండివుంటుంది కాని ప్రస్తుతం ఆ విషయాలేవీ చెప్పనందుకు విచారిస్తున్నాను త్వరలోనే కొన్ని విషయాలు మీకు తెలుస్తాయి. ఒక్క విషయం మాత్రం మీరు గమనించాలి ఇది రుద్రప్రయాగ పుణ్యక్షేత్రం. ఇక్కడ జన్మించిన కారణంగా ఈ బాలుడికి రుద్రదేవ్ అని నామకరణం చేసాము. మొన్నటి త్రయోదశికి ఇతనికి ఎనిమిదిమాసాలు నిండాయి. ఈ బాలుడిని భగవత్ప్రసాదంగా భావించి కడు జాగరూకతతో పెంచుకోండి. మీ కడుపున బిడ్డల్ని కనేయోగ్యత మీకు లేదన్న విషయం తెలుసుకొబట్టి ఇతనినే మీ తపః ఫలంగా ఎంచుకొని చూచుకోండి. ఇంక మీరు వెళ్ళిరావచ్చు" అని లేచారు స్వామీజీ. వారి పాదాలకు ప్రణమిల్లి పాపాయితో సహా బసకు చేరుకున్నాము.

పాపాయి చిరునవ్వులు చిందిస్తున్నాడు.

మా జీవన కుసుమాలు వికసించాయి.

భవిష్యత్తులోకి దారులు తెరుచుకున్నాయి.

అనతి దూరంలో చకచకా నడచిపోతున్న మందాకిని గలగలా నవ్వింది.

మా ప్రయాణం అంతటితో ఆగిపోయింది. కేదారేశ్వరునీ, బదరీనాథుణ్ణీ కూడా దర్శించాలన్న సత్సంకల్పంతో బయలుదేరాము మేమసలు. కాని ప్రయాణం చాలాకష్టం చాలదూరం కాలినడకనే పోవలసివుంటుంది. అందులోనూ బాబుతో ప్రయాణం చేయటం ఏమంత మంచిదికాదన్న వుద్దేశ్యంతో మేము వెనుదిరిగాం.

అక్కడినుంచి దొరికిన ప్రతిసాధనాన్ని వినియోగించుకొని, మార్గమధ్యంలో వున్న క్షేత్రాల్లో రాత్రిళ్ళు సేదదీర్చుకుంటూ అయిదోనాటికి హృషీకేశం చేరాము. అక్కడ రెండు రోజులు మాత్రముండి రైల్లో తిరుగుముఖం పట్టాము.

రుద్రదేవ్ చక్కగా ఆడుకుంటున్నాడు. జాహ్నవి మాతృహృదయం అతన్ని కంటికి రెప్పలా చూచుకుంటోంది. సెలవు రద్దుచేయించుకొని నేను ఆఫీసుకు వెళుతున్నాను. ఒక విధమైన సంతృప్తితో జీవితం వెళ్ళమారిపోతోంది.

ఆనాడు రెండవ శనివారం ఆఫీసుకు సెలవు. అందుచేత ఇంటిదగ్గరేవుండి పాత పత్రిక ఏదో తిరగేస్తున్నాను. ఇంతలో పోస్టుమాన్ పిలుపుతో బయటకువెళ్ళి కవరందుకున్నాను. అడ్రసు చూచాను. నాదే। దస్తూరి పరిచితమైనదికాదు. ఫ్రమ్ అడ్రసులేదు. ఉత్సుకతతో వాలుకుర్చీలో కూర్చుని కవరు విప్పాను.

రుద్రప్రయాగ
6-12-1961

బాబూ।

రుద్రదేవ్‌తో సహా మీరంతా క్షేమంగా ఇల్లు చేరారని తలుస్తాను. భగవాన్ దీవనలు మీకు సర్వవేళలా లభ్యంకావాలని ఆశీర్వదిస్తున్నాను.

ప్రస్తుతమీ ఉత్తరంద్వారా మీకు కొన్ని ముఖ్య విషయాలు చెప్పదలచాను. రుద్రదేవ్ భవిష్యత్తు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని మీకీవిషయాలు తెలియజేయటం మంచిదన్న ఉద్దేశ్యంతో ఈ ఉత్తరం రాస్తున్నాను.

ఇవి కేవలం ముఖ్యవిషయాలేగాకుండా గోప్యమైన విషయాలు కూడాను. అవసరాన్నిబట్టి నీ భార్యకు చెప్పినా సరే, చెప్పకున్నా సరే—ఆ విషయాన్ని నీకు వదిలేస్తున్నాను.

బాబూ। ఈ ప్రపంచంలో చిత్రాతిచిత్రమైన అనేక విషయాలు జరుగుతూంటాయి. అందులో మనకలయిక ఒకటి. పూర్వాశ్రమంలో నాపేరు రామయ్య. మాది కూడా కృష్ణాజిల్లాయే। పైపెచ్చు మీగ్రామం మాగ్రామంకూడా ఒకటే।। ఇప్పటికైనా తెలిసిందా బాబూ - నేను నీ తండ్రినని।।।

భగవానుడు కరుణామయుడు బాబూ। అందుకే బిడ్డను తండ్రి వద్దకు పంపాడు. అందులోనూ ఒక ముఖ్యసమయంలో పంపాడు.

నేను మొదటినుంచీ బాగా ఉద్రేకిని. ఏ విషయంలోనైనా ఒక నిర్ణయానికొచ్చే ముందు ఆలోచించటమనేది బొత్తిగా వుండేదికాదు. ఆ సమయానికి ఎలాతోస్తే అలా ప్రవర్తించేవాడిని. ఈ గుణమే నా జీవితాన్ని అశించని దారులవైపు మళ్ళించింది.

నా కిప్పటికీ బాగాగుర్తు ముప్పయ్యేళ్ళక్రితంనాటి సంగతది. సంక్రాంతి పండుగ అప్పటికి వారంరోజులుంది. నువ్వప్పటికి ఆరుసంవత్సరాలవాడివి. మీతాతగారు మన ముగ్గుర్నీ పండుగకు వాళ్ళింటికి రమ్మని ఉత్తరం రాశారు. మీఅమ్మ వెళదామంది. నేనురానన్నాను. బ్రతిమి లాడింది. నసేమిరా అన్నాను. ఆ ఒక్కసారికి తనకోరిక మన్నించమంది. వీల్లేదన్నాను. అప్పటికామె పుట్టినింటి ముఖంచూచి మూడేళ్ళయింది. ఇహ వుండబట్టలేక "మీరింత కఠినాత్ములనుకోలేదు" అంది. నాకు కోపం ముంచుకొచ్చింది. దబదబా నాలుగుగుద్దులేశాను. భర్తమాటను నిర్లక్ష్యం చేసే నీలాంటివాళ్ళకు తన్నులే శిక్ష అని పెద్దగా అరిచాను.

ఆమెకలాంటి తన్నులూ, గుద్దులూ క్రొత్తేమీకాదు. ముఖ్యంగా నాకు కోపమొచ్చినపుడు ఎన్నిఅన్నా నోరు మెదిపేది కాదు. కాని ఆనాడలా జరుగలేదు. కాళిలా చివ్వున లేచింది. ఆమెముఖంలో అసహ్యం కొట్టొచ్చినట్లు కన్పించింది. కోపంలో పెదాలు వణికాయి. అతి సామాన్యమైన భార్యకోరికను తీర్చలేని భర్తమాటకు విలువెందుకివ్వాలని ఎదురు ప్రశ్న వేసింది. అలాంటిభర్త వున్నాలేకున్నా ఒకటేనంది.

నాకోపం పూర్తిగా హద్దు మీరింది. ఆ సమీపంలోనున్న మంచినీటి గ్లాసును ఆమె మీదకు విసిరి వెనుతిరిగి చూడకుండా బయటకు నడచాను. వంటిమీద చొక్కా కూడాలేదు. చేతులో చిల్లిగవ్వకూడా లేదు.

అది బాబూ। నా నిష్క్రమణ వృత్తాంతం. ఆపైన ఎన్నోచోట్ల తిరిగాను. ఒకచోట ఒకస్వామీజీని ఆశ్రయించి సన్యాసం స్వీకరించాను. అలా కొన్నిరోజులు గడిచిపోయాయి. భుక్తి ఎలాగో గడుస్తోందిగాని భక్తిమాత్రం అలవడ లేదు. కోరికలు చావలేదు. మళ్ళా సంసారం చెయ్యాలన్న తృష్ణ వేధించ సాగింది. ఎన్నో విధాల నిగ్రహించుకో జూచాను. లాభం లేకపోయింది. చివరికొకనాడు అదే ఆశ్రమంలోవున్న ఒక బాలవితంతువుతోసహా ఎవరకూ తెలియకుండా మాయమయ్యాము. పూర్తిగా క్రొత్త ప్రదేశానికి తీసుకెళ్ళి అక్కడ ఆమెతో కాపురం పెట్టాను. సన్యాసి దుస్తులు తీసేసి, సంసారి దుస్తులు ధరించాను. కష్టపడి సంపాయించి రూపాయో అర్థో సంపాదించే వాడిని. వున్నంతలో అలాగే సర్దుకొని జీవించటం ప్రారంభించాము. రెండుసంవత్సరాలకు ఆమెకు కాన్పువచ్చి మగశిశువును కని చనిపోయింది. నా జీవితం మరోసారి మలుపులో ప్రవేశించింది. పిల్లవాడిని తీసుకొని మళ్ళా దేశాటనకు బయలుదేరాను. అతి కష్టంమీద వాడిని సాక సాగాను. బాలక్రిష్ణ అని నామకరణం చేశాను. నేనీ రుద్రప్రయాగ చేరుకునేనాటికి వాడికి ఐదేళ్ళు. అప్పటినుంచీ ఇక్కడే స్థిరపడి పోయాము. బాలకృష్ణ పెరిగి పెద్దవాడయ్యాడు. నాలోని కోర్కెలు అడుగంటగా కేవలం ఆధ్యాత్మిక చింతనతో కాలం గడిపేస్తున్నాను.

కాని ఈలోగా మహా అవాంతరం వచ్చిపడింది. బాలకృష్ణమూలంగా ఆశ్రమంలో నున్న ఒక యువతి గర్భవతిఅయిందని తెలిసి చలించి పోయాను. క్షణకాలం బాధ కలిగినా ఆపైన వాళ్ళ నిరువురినీ మనస్ఫూర్తిగా క్షమించగలిగాను. వాళ్ళిరువురకూ వెంటనే వివాహంచేసి గృహస్థాశ్రమానికి పంపేందుకు నిశ్చయించుకున్నాను.

(తరువాయి 29 వ పేజీలో)

## ఉషశ్రీ పరిశీలన

(5 వ పేజీ తరువాయి)

కథలు యిటీవలి కాలంలో స్త్రీలేకాదు పురుషులూ. వ్రాయలేక పోతున్నారేమో

ఈ వాక్యాన్ని యిక్కాలంలో అనగా యీ దశాబ్దిలో ప్రభవించిన రచయిత్రు ప్రపంచానికే పరిమితం చేసుకోకపోతే సమీక్షకుడి బాధ్యత లేదు.

వ్యావహారికోద్యమం విశృంఖల విహారం చేసే రోజులలో ప్రభవించిన రచయిత్రు జగత్తులో భాషా జ్ఞాన శూన్యత ప్రతిపద దర్శనీయం అయినస్థితిలో చిరంజీవి లీల ఆ దౌర్బల్యాన్ని ప్రదర్శించుకోకుండా తన దగ్గరున్న భాషా భండారాన్ని చక్కగా వినియోగించుకోవడం శబ్ద సౌకుమార్యాన్ని ఆరాధించే సారస్వత పాంథులకు చల్లని నీడయే అయింది. అయినా అక్కడక్కడ అనివార్యంగా కాక అనవసరంగా ఇంగ్లీషు పదాలను జొప్పించడం కొంచెం ప్రాథమిక దశనే సూచిస్తున్నది.

ఋతు పవన గాలులవంటి అగ్ని నిప్పు ప్రయోగాలు యీ పానకంలో పుడకల్లా తగులుతుంటే "బలిచక్రవర్తిని దానం అడగడానికి వచ్చిన వామనుడు అడ్డంగా పడుకోగలడంతే" వంటి ప్రయోగాలు, ఇంతింతై వటుడింతయై. అంతటి స్థితిని కలిగించకపోయినా, ప్రాచీన గాథాలహరీ స్వీకర సేచన శక్తిని స్ఫురింపించి "సెహబాష్" అనిపిస్తాయి.

ఇక కథ దృష్ట్యా పరిశీలిస్తే యిది నిలవదని ముందే చెప్పాను. మంగళాదిని, మంగళాంతాని వగైరాలిక్కడ పనికిరావు కథ యెత్తుగడకూ - ముగింపుకూ 'నప్పే' పొంతన.

ఈ మాత్రపు భాషా, శిల్పాలను సంతరించుకున్న చిరంజీవి లీల మరికొంత ఓరిమితో (క్షమయాధరిత్రి) యితివృత్తంపై దృష్టిని కేంద్రీకరిస్తే బహుమతులిచ్చినవారికి కృతజ్ఞత చూపినట్లు కాగలదు. అది ఆశిద్దాం.

—:0:—

## ఎండమావులు

(22 వ పేజీ తరువాయి)

కాని బాబూ! ఆశించటం ఒక యెత్తు. ఆశించిన దానిని అందుకోగలగటం ఒక యెత్తు. నాకేవార్త తెలిసేదని ఎలా పసిగట్టాడోగాని బాలకృష్ణ ఆక్షణం నుంచి నాకు కన్పించలేదు. ఈనాటివరకు అతని జాడ నాకు తెలియనే లేదు.

క్రమంగా నెలలు నిండగా ఒకనాటి ప్రాతః కాలంలో ఆమె ప్రసవించింది. మగశిశువు జన్మించాడు. కాని అనాక సందకు స్నానానికి వెళ్ళిన ఆమె తిరిగి రాలేదు. జీవితంలో భంగపడ్డ ఆమె నిబ్బరాన్ని కోల్పోయి ప్రాణ త్యాగం చేసింది. ఆమె బిడ్డడే సుదర్శన్! తెలిసిందా బాబూ! జీవితం ఎంతచిత్రమైందో! బిడ్డలు కలగని నీకు నీ సహోదరుని బిడ్డణ్ణి భగవానుడు ప్రసాదించాడు. ఒక కొడుకును నా నుంచి ఎటోపంపి మరో కుమారుణ్ణి నా వద్దకు పంపాడు.

భగవానుడు కరుణామయుడు బాబూ! ఇంక తీరని కోరికలంటూ నాకేమీలేవు. ఈ చివరిరోజులు ప్రశాంతంగా వెళ్ళిపోవాలని మాత్రమే కోరుకుంటున్నాను.

ఇహ చివరిమాట. గతంలో నేర్చుకున్న పాఠాలు భవిష్యద్భవనానికి గట్టి పునాదులు కావాలి. కాని గతాన్ని గురించి వగవకూడదు. వర్తమానాన్ని సాధ్యమైనంత సత్పథంలో నడిపిస్తూ భవిష్యద్భవనానికి చక్కటి సోపానాలు నిర్మించుకోవాలి గట్టిపునాదులూ అందమైన సోపానాలూవున్న భవనంలో జీవించగలగటంకన్నా ఎవరైనా కోరుకోదగింది మాత్రం ఏముంటుంది బాబూ! మీ అందరికీ నా ఆశీస్సులు.

స్వామీజీ

## ప్రకటన

మహారాజశ్రీ రేపల్లె డిస్ట్రిక్టు
మున్సబు కోర్టులో

S C 500/61 E. P. 197/62

నర్సాపురం డి. యమ్ సి. ఫైలు

బుగ్గా నాగేశ్వరశాస్త్రి - డిక్రీహోల్డరు
రాంపల్లి వెంకటచలం-జడ్జిమెంటుడెటరు
వాది తరపు దాఖలు చేసిన షెడ్యూలు

గుంటూరు డిస్ట్రిక్టు చెరుకుపల్లి సబ్ డిస్ట్రిక్టు యిలాకా పొన్నపల్లి అగ్రహారం గ్రామములోని ప్రతివాద్కి కుడివరం మేలువరం హక్కుభుక్తములు గల్గి యీనెంబరు డిక్రీ బాకీక్రింద జప్తు అయి వేలము కావలసిన స్థిరాస్థివివరం.

1) డి. నె 116 రు య 5-70 ట్లులో ప్రతివాద్కి కుడివరం, మేలువరం హక్కుగల య 2-45 ట్లుకు హద్దులు. తూ) డొంక, ద) డి. నె. 117 యిలో రాంపల్లి వెంకట సుబ్రమణ్యం వగయిరాల భూమి, ప) యీనెంబరు పొన్నపల్లి వెంకటసుబ్బయ్య వగయిరాల భూమి ఉ) డి. నె. 115 రు లోని పంతుల వెంకట నరశింహ్వాము వగయిరాభూమి. యీ హద్దుల మధ్య మెరక మాగాణి. య 2-45 ట్లు మాత్రం.

enchmbrance certificate

దాఖలా అన్యాక్రాంతము ది 13-12-58 తేదీగల చీమకుర్తి వెంకటేశ్వర్లు పేరట వ్రాయించి యిచ్చిన రు. 2,200-00 ల అస్వాధీనపు తనఖా వడ్డీ నెల 1కి నూటికి 0-8-0 చొప్పున బాకీకి లోబడి యన్కమ్బ్రెన్సు సర్టిఫికేటుకులోబడి.

సర్కారు పాట 5000/- రు.

వేలం వాయిదా 18-2-63

ఫర్ధర్ హియరింగ్ 25-2-63

పి. వి. గోపాల కృష్ణమూర్తి
యమ్. ఎ యల్. యల్. బి.
డిక్రీహోల్డరు తరపు అడ్వకేటు

—:0:—